
భోజనమా.. సరకులా..

- నాలుగు అంశాలపై ఆరా తీస్తున్న సిబ్బంది
- అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్తయిన సర్వే

ప్రభుత్వం అంగాన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. దీనివల్ల శిశుమరణాల రేటు తగ్గింది. చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యం మెరుగుపడింది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేందుకు గర్భిణులకు ఆసక్తి తగ్గుతోంది. దీంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సర్వే చేపట్టింది. కేంద్రాల్లో భోజనం పెట్టాలా లేదా సరుకులు ఇంటికి ఇవ్వాలా అనే అంశంపై సర్వే పూర్తయింది.


పోతవరం అంగన్‌వాడీ కేంద్రం 48లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు

నల్లజర్ల: ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం వండి వేడివేడిగా వడ్డించేవారు. కరోనాతో అది నిలిచిపోయింది. తల్లులకు, పిల్లలకు డ్రైరేషన్ ఇంటికే అందించేవారు. ప్రస్తుతం మళ్లీ కేంద్రాల్లోనే వీరికి భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. లేదంటే ఇంటికి తీసుకెళ్లి తినమన్నా స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో బాలింతలకు, గర్భిణులకు భోజనం ఏవిధంగా అందించాలనే విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలుగు అంశాలతో కూడిన సర్వేను అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే కార్యక్రమం పూర్తయ్యింది. గర్భిణులు పోషకాహారం తీసుకోకపోవడం వల్ల పిల్లలు లోపాలతో పుడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. గతంలో బియ్యం, నూనె, పప్పు, పాలు, గుడ్లు నెలనెలా ఇంటికి అందించేవారు. అవి సక్రమ వినియోగం జరగడం లేదని కేంద్రాల్లోనే వండిపెట్టాలన్న నిబంధన పెట్టారు. దీంతో లబ్ధిదారులు అరకొరగానే వస్తున్నారు. నెలలు నిండిన గర్భిణులు కేంద్రాలకు నడిచి రావడం ఇబ్బందిగా మారడంతో బాక్స్‌ల్లో భోజనం ఇంటికి తీసుకెళ్లవచ్చునని ఆదేశాలు జారీ చేసినా హాజరు శాతం అంతంత మాత్రంగానే ఉంటోంది. గోపాలపురం నియోజకవర్గంలో 310 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో గర్భిణులు 1804 మంది, బాలింతలు 2267 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు 9007మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు 5222 మంది ఉన్నారు.


సర్వే పత్రం

సర్వేలో అంశాలు ఇవే..

గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం తింటారా? బాక్స్‌లో పెట్టుకొని ఇంటికి తీసుకెళతారా? టేక్ హోం రేషన్ ఇస్తే బాగుంటుందా? ఇవేవి వద్దా ? అనే నాలుగు అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాలలో గత రెండు వారాలుగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను లబ్ధిదారుల ద్వారా తెలుసుకొని కార్యకర్తలు వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చే కార్యక్రమం పూర్తయింది.

కారణాలు తెలుసుకుంటున్నాం



గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తేనే మంచిదన్న విషయాన్ని పలుమార్లు అవగాహన కల్పించాం. అయినా చాలా మంది రావడానికి ఇష్టపడడం లేదు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు 310 కేంద్రాలలో ఉన్న లబ్ధిదారుల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్న వివరాలను ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం.

– కె.స్వరాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, సీడీపీఓ, నల్లజర్ల

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సపత్‌తక్రా పోటీల్లో దొమ్మేరు విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

కొవ్వూరు: ఈనెల19, 20, 21 తేదీల్లో అనంతపురం జిల్లా ఉవరకొండలో పోలీసు గ్రౌండ్‌లో నిర్వహించిన సపత్ తక్రా అండర్–17, అండర్–14 రాష్ట్ర స్థాయి పోటీల్లో దొమ్మేరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్ –14 బాలిక విభాగంలో ప్రథమ స్థానం, బాలురు జట్టు తృతీయస్థానం సాధించారు. అండర్–17లో బాలికలు ద్వితీయ స్థానం సాధించగా బాలురు ప్రథమ స్థానం సాధించారు. ఈ పోటీల్లో వై.విశ్వాపాల్, బి.చరణ్ తేజ, డి.ప్రియాంక, బి.గీతిక, జి.కోటసతీష్ ప్రతిభ కనపరిచినట్టు ప్రధానోపాధ్యాయుడు జె.వెంకట శ్రీనివాస్ తెలిపారు. వారిని సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి సత్కరించారు. పీఈటీ ఈ.శ్రీనివాస్‌ను వారు అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొవ్వూరు: ఈనెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి 4.30 గంటల వరకూ డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్‌వీ కుమార్ తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ఇతర సమస్యలపై తెలియజేయాలనుకునే 91009 54631 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్యాస్ డెలివరీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు రూరల్: స్థానిక విజయదుర్గా హెచ్‌పీ గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిడదవోలు సీఐటీయూ కార్యాలయంలో వర్కర్స్ సమావేశాన్ని యర్రా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ నాయకులు జువ్వ రాంబాబు మాట్లాడుతూ గ్యాస్ వర్కర్స్‌కి రక్షణ పరికరాలు యజమాన్యాలు తప్పకుండా ఏర్పాటు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా జువ్వల రాంబాబు, అధ్యక్షుడిగా ఎండీ రసూల్‌ఖాన్, ఉపాధ్యక్షుడిగా కె.లక్ష్మణరావు, కోశాధికారిగా కేవీ సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా యాళ్ల రామకృష్ణ, కె.దుర్గారావు, కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే పురోభివృద్ధి

రాజమహేంద్రవరం రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమనేది ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డి నమ్మకమని, ఆ దిశగానే సీఎం చర్యలు చేపడుతున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. 38వ డివిజన్ సీతంపేటలో వైఎస్సార్ సీపీ వార్డు గృహసారథులు, మహిళలతో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే తన సంకల్పమన్న సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాలతో అనుకున్న లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద డ్వాక్రా, మెప్మా బజార్లు ఏర్పాటు చేయించాలనేది తన ఆలోచన అన్నారు. ఆయా సెంటర్ల వద్ద ఖాళీ స్థలాలను సేకరించి షాపులు నిర్మించి మీకు కేటాయిస్తామని ఎంపీ తెలిపారు. మీరు తయారు చేసే పచ్చళ్లు, పిండి వంటలు, అల్లికలు, పేపర్ ప్లేట్లు తదితర వాటిని విక్రయించుకోవచ్చన్నారు. నగరంలోని 42 డివిజన్లలో దాదాపు 40 వేల మంది డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యే దిశగా ముందడుగు వేస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లపూడి: అన్నదేవరపేట సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సీహెచ్ వెంకటరావు తెలిపారు. అన్నదేవరపేట, సూరయ్యపేట గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ప్రక్కిలంక సబ్ స్టేషన్ పరిధిలో టౌన్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ప్రక్కిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి, వేగేశ్వరపురం, గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

చాగల్లులో అన్నసమారాధన

చాగల్లు: స్థానిక సాయిబాబా మందిరంలో ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా గురువారం ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భజనలు చేశారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ విచ్చేసి పూజలు చేశారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శివనాగరాజు

నల్లజర్ల: బీజేపీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలానికి చెందిన శెట్టిపల్లి శివనాగరాజును రెండోసారి నియమించారు. జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గోపాలపురం నియోజకవర్గంలో మండల, బూత్ స్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేసి పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా


ఆలయంలో పారాయణ చేస్తున్న భజన మండలి సభ్యులు

నల్లజర్ల: దూబచర్ల–ఘంటావారిగూడెం గ్రామాల మధ్య ఉన్న లలితా కామేశ్వరస్వామి ఆలయంలో దుర్గా అపరాధీశ్వరస్వామి ఉపాలయంలో లక్షసార్లు హనుమాన్ చాలీసా పారాయణం పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 200 మంది భజన మండలి సభ్యులు ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ సాయంత్రం వరకూ ఈ కార్యక్రమం కొనసాగినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు వంకదార రాంబాబు, నాదెళ్ల శ్రీరామ్, సవలం రామకృష్ణ పర్యవేక్షించినట్టు ఆయన తెలిపారు.

రేపు మండల సమావేశం

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.రాజశేఖర్ తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటల నుంచి సమావేశం జరగనుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అనుబంధ విభాగాల్లో సముచిత స్థానాలు


షేక్ వజీరుద్దీన్


మానుకొండ చంద్రబాబు


మేడిబోయిన గంగరాజు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో కొవ్వూరు నియోజకవర్గానికి మూడు కీలకమైన పదవులు వరించాయి. ఐ.పంగిడి గ్రామానికి చెందిన చౌటుపల్లి వీరన్న జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితుడు కావడంపై హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ క్రియాశీలకంగా పని చేస్తున్న వీరన్న గతంలో మండల యువజన విభాగం అధ్యక్షుడిగాను, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. పట్టణానికి చెందిన సలాది సందీప్‌కుమార్ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియ మితులయ్యారు. గతంలో ఈయన పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గాను, పట్టణ బూత్ కమిటీ కన్వీనర్ గాను పనిచేశారు. తాళ్లపూడికి చెందిన గుడా విజయరాజు గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గతంలో ఈయన జిల్లా కమిటీ సభ్యులు గాను, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడిగా షేక్ వజీరుద్దీన్

నిడదవోలు రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడిగా నిడదవోలుకు చెందిన షేక్ వజీరుద్దీన్‌ను నియమించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వజీరుద్దీన్ నిడదవోలు మున్సిపల్ కౌన్సిలర్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ప్రకారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సహకారంతో పార్టీ పటిష్టతకు మరింత కృషిచేస్తానని ఆయన తెలిపారు. వజీరుద్దీన్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం సోదరులు గురువారం కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మానుకొండ

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన మానుకొండ చంద్రబాబును నియమిస్తూ పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేసిన చంద్రబాబు మండల సంయుక్త కార్యదర్శిగా, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. చంద్రబాబును ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, పార్టీశ్రేణులు అభినందించారు.

పార్టీ జిల్లా యువనజ విభాగం అధ్యక్షుడిగా గంగరాజు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం తర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకు చెందిన మాజీ ఎంపీపీ మేడిబోయిన గంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. నియామక పత్రాన్ని గురువారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గంగరాజుకు అందజేశారు. గంగరాజుకు పదవి రావడంపై పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. గంగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ మార్గాని భరత్ రామ్, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ)కి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో పర్యటించి యువతను బలోపేతం చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోవు ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పీడీ పరశురామ్


దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారిని మర్యాదపూర్వకంగా కలిసిన గృహనిర్మాణ శాఖ పీడీ పరశురామ్

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా నూతన పీడీగా బాధ్యతులు చేపట్టిన గంటి పరశురామ్ గురువారం దేవరపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సొంత ఇంటి స్థలం కలిగిన పేదలు 14,365 మంది ఉన్నారని, వీరికి గృహాలు మంజూరు చేయాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కోరగా సుముఖత వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. పేదలందరికీ తక్షణం గృహాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. గతంలో గృహాలు మంజూరు కాగా గృహ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, వీరికి బిల్లులు చెల్లించాలని ఆయన తెలిపారు. జిల్లాలో గోపాలపురం నియోజకవర్గం గృహ నిర్మాణంలో వెనుకబడి ఉందని, ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని, రూడాలో లేనందున మంజూరు కాలేదని ఆయన తెలిపారు. ఇటీవల నియోజకవర్గాన్ని రూడాలో విలీనం చేసినట్టు ఆయన తెలిపారు. గృహాలను మంజూరు చేస్తామని పీడీ పరశురామ్ ఎమ్మెల్యే వెంకట్రావుకు తెలిపారు. డీఈఈ టి.శేఖర్‌బాబు, ఏఈ కె.ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు


బ్రాహ్మణగూడెంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాగల్లు: క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యులు పీఆర్ఎల్ దేవి తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాత, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు సహకారంతో పౌష్టికాహారాన్ని టీబీ పేషెంట్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దేవి మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే తగ్గే వరకూ ఉచితంగా చికిత్స కూడా చేస్తారని ఆమె తెలిపారు. రెండు వారాలు పాటు ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం ఉంటే కచ్చితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీబీ యునిట్ సిబ్బంది ఉన్నారు.

వీఆర్వో బదిలీ

ద్వారకాతిరుమల: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తిమ్మాపురం వీఆర్వో ఎ.వీర్రాజును డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆయనను రిలీవ్ చేయాలని ద్వారకాతిరుమల తహసీల్దార్‌ను ఆదేశించారు. వివరాలు ప్రకారం. మండలంలోని తిరుమలంపాలెం పంచాయతీ పావులూరివారిగూడెం చెందిన బంటుమిల్లి రామలక్ష్మి సంబంధిత వీఆర్వో వీర్రాజుపై గతంలో అవినీతి ఆరోపణలు చేస్తూ ఉన్నతాధికారులకు, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. 2015లో తిరుమలంపాలెంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయన కొందరు టీడీపీ నేతలతో కలిసి, జన్మభూమి కమిటీ ద్వారా భూ వివాదాలు సృష్టించి, అవినీతికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కొద్ది నెలల క్రితం విచారణ చేసిన జంగారెడ్డిగూడెం ఆర్డీవో డాక్టర్ ఝాన్సీరాణి సంబంధిత నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వీఆర్వో వీర్రాజును ఉంగుటూరు మండలం తల్లాపురానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేశారు.

'పొలంబడి'తో రైతులకు ఎంతో మేలు


వెంకటాయపాలెంలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గోపాలపురం: వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని కొవ్వూరు వ్యవశాయ శాఖ ఏడీఈ పి.చంద్రశేఖర్ అన్నారు. వెంకటాయపాలెంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానం అమలు చేయాలని తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మెట్ట రైతులు వర్జీనియా పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు పండించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల వ్యవశాయశాఖాధికారి బి.రాజారావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల రైతులు వ్యవశాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

చాగల్లు: ఏపీ స్టేట్ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఎంపీడీవో బి.రాంప్రసాద్ తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతి యువకులకు అకౌంట్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ బ్యూటీ థెరియెపిస్ట్ కోర్సులో 3 నెలల పాటు నిడదవోలు ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 73866 30918 సంప్రదించాలని తెలిపారు.

ఆకట్టుకున్న వేంకటేశ్వరుని గానామృతం


భజన మండలి గురువు ఆలపాటి ధనలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నల్లజర్ల: ఆవపాడు గ్రామంలో మద్దూరి విష్ణుమూర్తి ఇంటి వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వేంకటేశ్వర కల్యాణ గానామృత కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. సింగరాజుపాలెంకు చెందిన మురళీకృష్ణ భజన మండలి అధ్యక్షురాలు ఆలపాటి ధనలక్ష్మి బృందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి శాస్త్రోక్తంగా వేదపండితులు సుబ్రహ్మణ్యం కల్యాణం జరిపించారు. ఈ వేడుకల్లో గానం ఆలపించిన భజన మండలి గురువు ఆలపాటి ధనలక్ష్మిని నూతన దుస్తులతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు, కల్కిమూర్తి, బాలాజీ, భద్రం, పెదకాపు, మద్దూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బాలయేసును దర్శించాలి


దొండపూడిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

గోపాలపురం: బాలయేసును దర్శించిన వారు ధన్యులని ఏలూరు మేత్రాసన కోశాధికారి రెవరెండ్ ఫాదర్ బి.రాజు అన్నారు. దొండపూడి బాలయేసు ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన జపమాల, దివ్య బలి పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బాలయేసు ఉత్సవాలకు వేలాది మంది భక్తులు పాల్గొనడం హర్షనీయమన్నారు. బాలయేసు పుణ్యక్షేత్రం డైరెక్టర్లు ఫాదర్ అలెక్స్, జొబిన్, జితిన్ దొండపూడి, సాగిపాడు గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

- ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్

ద్వారకాతిరుమల: మైనర్‌కు వివాహం జరగబోతోందని సమాచారం అందుకున్న సచివాలయ మహిళా పోలీస్ ఆ బాల్య వివాహాన్ని అడ్డుకుంది. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఇరు కుటుంబ సభ్యులను తరలించగా అక్కడ పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా గుడివాడలోని ధనియాలపేటకు చెందిన 15ఏళ్ల వయస్సు గల మైనర్ బాలికకు, బాపట్ల జిల్లా రేపల్లె మండలానికి చెందిన వ్యక్తితో గురువారం రాత్రి ద్వారకాతిరుమలలో వివాహం జరగబోతోందని చైల్డ్ లైన్ వారు స్థానిక సచివాలయం–2 మహిళా పోలీస్ పి.లక్ష్మీసుజనకు సమాచారం అందించారు. దీంతో ఆమె ఉదయం క్షేత్రంలోని అన్ని లాడ్జిలను తనిఖీ చేస్తుండగా, ఒక ప్రైవేటు లాడ్జిలో వారిని గుర్తించి, ఆ సమాచారాన్ని ఎస్సై టి.సుధీర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ, చైల్డ్‌లైన్, వీఆర్వో మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించింది. ఆ తరువాత బాలిక, యువకుడితో పాటు, ఇరు కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా వివాహ వయస్సు వచ్చే వరకు బాలికకు పెళ్లి చేయమని కుటుంబ సభ్యులు లిఖిత పూర్వక హామీ పత్రాన్ని రాసిచ్చారు.

బెస్ట్ గైడ్ టీచర్‌గా రామాంజనేయులు


బెస్ట్ గైడ్ టీచర్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు: మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కేఎస్ఆర్ రామాంజనేయులుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో గురువారం ధ్రువపత్రం అందుకున్నారు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మద్దూరు పాఠశాల సైన్స్ ప్రాజెక్ట్ గ్రీన్ ఏపీ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో అక్కడి శాస్త్రవేత్తలో పలు అంశాలపై చర్చలు, సెమినార్లలో ఆయన పాల్గొని ఉత్తమ గైడ్ టీచర్‌గా ఘనత సాధించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ లలిత్ శర్మ, భారత ప్రభుత్వం తరఫున సుజిత్ బెనర్జీ సర్టిఫికెట్ పంపించారు. కాగా.. రామాంజనేయులును అర్బన్ రేంజ్ డీఐ బి.దిలిప్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ఎస్ నెహ్రూ, కన్నూరి సతీష్ బాబు, మద్దూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.సుబ్బలక్ష్మి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం


పెద్దేవంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, సిబ్బంది

తాళ్లపూడి: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని జిల్లా కమ్యునిటీ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఎం.టి. హరిచంద్రప్రసాద్ తెలిపారు. పెద్దేవంలో గురువారం ప్రకృతి వ్యవసాయం, సహజంగా భూ సారం పెరగడానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు మాట్లాడుతూ 30 రకాల పప్పు ధాన్యాలు, నునె రకాలు, చిరుధాన్యాల పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డి.భీష్మాంబ, ధర్మరాజు, రైతులు కోడి శంకరం తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ఖరీఫ్‌లో నవధాన్యాలు సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు. గౌరీపట్నంలో గురువారం నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయశాఖ సబ్ డివిజన్ యాంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు 30 రకాల చిరుధాన్యాలను 13 కిలోలు వేయాలన్నారు. దీనిపై నెల రోజుల పాటు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రైతులకు ఉన్న మొత్తం భూమిలో నవధాన్యాలు వేయాలని ఆయన సూచించారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ర్యాలీ చేశారు. సిబ్బంది డి.కృపావతి, కె.సురేష్, కె.సత్యవతి పాల్గొన్నారు.